కళ్యాణతిలకం – కోసూరి ఉమాభారతి

వివాహ వేడుక విధివిధానంలో పాటించవలసిన సాంప్రదాయాలు, ఆచారాలతో పాటు 'వధువు అలంకరణ' కూడా ప్రాధాన్యత సంతరించుకుంటుంది. బ్రహ్మస్థానమైన నుదిటి పై వివాహిత ప్రతిదినం కుంకుమ దిద్దితే.. భర్త ఆయుష్షు పెరుగుతుందని, శుభాలు కలుగుతాయని చెబుతుంది మన సంస్కృతి.

ఆచార సాంప్రదాయాలని అనుసరించి పాణిగ్రహణ సమయంలో ఉచ్చరించిన పెళ్లి ప్రమాణాలు 'పదికాలాల పాటు నిలబడతాయని, వైవాహిక జీవితం అన్యోన్యంగా సాగుతుందని సూచిస్తుంది మన సాంప్రదాయం.

విభిన్న కుటుంబ నేపథ్యాల నుండి భిన్న మనస్తత్వాలు కలిగి ఉన్న ఐదుగురు అమ్మాయిల గురించి, వారినడుమనున్న మైత్రి బంధం గురించి, వారి ఆశలు, ఆశయాల గురించి సాగుతుంది

***'కళ్యాణతిలకం'** నవల లోని కథనం.*

వారి వైవాహిక జీవితాల్లోని ఆనందాలు, వైఫల్యాలు, అరమరికలు, అనురాగాల గురించి సాగుతుంది ఇతివృత్తం

ఒకరిది తీర్చలేని వ్యధ, ఒకరి జీవితం ఆనందాల డోలిక, ఒకరి కాపురం కష్టాల కాష్టం, మరొకరిది నిత్యవసంతం గా సాగే సంసారం, వేరొకరికి 'కళ్యాణం' కలగిపోయే కల.

ఐదుగురు అతివల జీవన గాధలని ప్రతిబింబించేదే 'కళ్యాణతిలకం' నవల.

(గత సంచిక తరువాయి)

మెల్లాలో కూరలు తరుగుతున్న అమ్మకి నర్సరీ రైమ్స్ వినిపిస్తున్న సందీప్ బాబుని చూసి.. వారి వద్దకెళ్ళి కూర్చున్నారు ఊర్మి, మాళవి. "ముద్దుగా ఉన్నాడు బాబు." అంటూ వాడి చెంపలు నిమిరింది మాళవి.

వాడి చేతికున్న కట్టు గమనించి, "అరే, పాపం! చేతికి ఏమయింది ఇంత చిన్నవాడికి?" అడిగింది.

పుట్టినరోజు నాటి ఆటల్లో వాడి మణికట్టు విరిగిందని, అదే చిరాకులో ఉదాసీనంగా ఉండిపోయానని' సంజాయిషీ చెప్పుకున్నాను.

"మగపిల్లలకి ఇవన్నీ మామూలే. కాకపోతే, ఇంత చిన్నవాడికి రిస్ట్-ఫ్రాక్చర్ అంటే.. ఎదుగుదలకి స్వల్పంగా ఆటంకం కలగవచ్చు. అదైనా సర్దుకుంటుంది." అంది యధాలాపంగా మాళవి.

"ఇంతకీ, మీరిద్దరూ ఎలా ఉన్నారు?" అడిగాను స్నేహితురాళ్ళని నా చేతుల్లోని పాపని అమ్మకి అందిస్తూ.

"నేను సైకియాట్రీ ఫెలోషిప్ చేస్తున్నాను. పూర్తయ్యాక, నా భర్తతో కలిసి ఎక్కడన్నా పెద్ద హాస్పిటల్ కి పని చేస్తాము. నా ప్రణాళికలో మార్పు లేదు." అంది మాళవి నవ్వేస్తూ.

"మరి ఊర్మిళ మేడమ్! తమరు పాపతో, పనితో బిజీబిజీగా ఉంటున్నారా?" అడిగాను ఊర్మీ ని.

"నా కూతురికి రెండేళ్ళు నిండాయి కనుక ఆలస్యం చేయకుండా నేను మరో బిడ్డని కనాలన్నది మా అత్తగారి హుకుం. పుట్టినిల్లు, మెట్టినిల్లు పక్కపక్కనే అవడంతో మాకు డబల్ ధమాకా అనుకో. మా అమ్మకి వత్తాసు పలుకుతూ నేను... వాళ్ళమ్మకి వత్తాసు పలుకుతూ బావ.. గొడవ పడుతూనే ఉంటాము." అని క్షణమాగింది ఊర్మిళ.

"మేనరికం అంటే మీ అత్తయ్య కూడా అమ్మలా నిన్ను ముద్దుగా చూసుకుంటారని కదా!" అన్నాను.

"అయ్యో ఖర్మ! అలాగనే మేమూ అనుకున్నాము. కానీ పెళ్లయ్యాక సీన్ వేరే గా ఉంది. అమ్మా, అత్తయ్యల మధ్య నిత్యం మాటల యుద్ధం జరుగుతుంది. పిల్లల పెంపకం, ఆస్థుల వ్యవహారాలు, రోజూవారీ వంటలు, పండుగలు, ఆచారాలు... అన్నింటా వారి మాట ఉండాల్సిందే, నెగ్గాల్సిందే.

అప్పుడప్పుడు ఊపిరి బిగబట్టుకుని బతుకుతుంటాను తెలుసా? మా జీవితాల్లో ఇరువైపుల పెద్దవాళ్ళ ప్రమేయం ఎక్కువే. నాకూ మా ఆయనకి నడుమ వీళ్ళ వల్లే అప్పుడప్పుడు తగువులు. కానైతే, మా వెన్నెలమ్మ వల్ల మేము సూపర్ గానే ఉన్నామనుకో." అంది ఊర్మిళ.

"పోనీలే, మీరు బాగున్నారు. అది మంచి విషయమే. ఇకపోతే, వెన్నెల పుట్టినప్పుడు చూడడానికి రావాలనుకున్నాను. మా ఇంట్లో ఎప్పుడూ ఏదో హడావిడి. ఇల్లు వదిలే పరిస్థితి లేదు." అంటూ లేచి వెళ్ళి గదిలోని నా సూట్–కేస్ నుండి వెన్నెల కోసం తెచ్చిన వస్తువుల బాక్స్ అందుకున్నాను.

బాక్స్ నుండి బంగారు గొలుసు, గాజులు తీసి వెన్నెలకి పెట్టాను. "నీవు పుట్టిన రెండేళ్లకయినా ఈ చిన్ని కానుక ఇవ్వగలిగాను కదా వెన్నెలా!" అంటూ పాపకి ముద్దు పెట్టాను.

"ఇంత భారీగా కానుకలు దేనికమ్మా? నాకప్పుడు సి–సెక్షన్ అయిందని రోజుకి రెండు సార్లయినా ఫోన్ చేసి బాగోగులు కనుక్కునేదానివి." అని గుర్తు చేసింది ఊర్మిళ.

అలా ఎడతెరపి లేని మా కబుర్లు చాలాసేపు సాగాయి. వందన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

"నీకు తెలుసునా కళ్యాణి! మన ఒకప్పటి క్లాస్–మేట్, ఫిల్మ్–స్టార్ లియానాతో ఊర్మీ 'టచ్ లో ఉందంటే నమ్ము. ఊర్మీ అడగ్గా.. తన విడాకుల విషయం, తల్లితండ్రుల నుండి విడిపోవడం.. అన్నీ నిజమే అన్నదట లియానా." అంది మాళవి.

"నిజమా? అంత పెద్ద స్టార్ అయ్యాక కూడా నీతో మాట్లాడుతుందా? అంత సమయం ఉందా తనకి? అయినా మొండిడానివి. నువ్వు ఊరుకోవుగా! మీ నడుమ స్నేహం ముచ్చటగా ఉంది." అన్నాను.

"అంత సీన్ లేదులే, ఏదో తనకి ఉత్తమ నటి అవార్డు వచ్చినప్పుడు, తను బాగా నటించిన సినిమా చూసినప్పుడు శుభాకాంక్షలు చెబుదామని నేను నాలుగు సార్లు మెసేజీలు పెడితే.. తాను ఎప్పటికో అర్ధరాత్రి సమయంలో ఫోన్ చేసి నాలుగు మాటలు మాట్లాడుతుంది. కానీ పాపం మంచిదే. గర్వం చూపదు. ఏదో తన వృత్తిపరమైన వొత్తిళ్ళు నడుమ నలుగుతున్నట్టుంది." అంది ఊర్మీ.

అమ్మ భోజనానికి పిలిచేంత మటుకు, సమయం తెలియనే లేదు. అత్తమ్మా వాళ్ళ గురించి, మా కుక్కపిల్లల గురించి వాకబు చేశారు.

"నేను లేనుగా! అక్కడ వారి యోగక్షేమాలు తెలియడం లేదు." అని జవాబిచ్చాను.

మా కబుర్లు అయ్యేప్పటికి సాయంత్రమయ్యింది. టీ తాగి, "మళ్ళీ వస్తాము." అంటూ కదిలారు వారు. గేటు వరకు నాతో పాటు వచ్చి వాళ్ళని సాగనంపాడు సందీప్.

❦❦❦

స్నేహితురాళ్ళతో మాట్లాడాక, అత్తమ్మ గురించి ఆలోచన ఎక్కువయింది. అత్తమ్మావాళ్ళని వారి మనవడి ముద్దుమురిపాలకి దూరం చేయకూడదని నిశ్చయించుకొన్నాను.

❦❦❦

రాత్రయ్యాక, బాబుకి కథ చెబుతూ నిద్రపుచ్చాలని ప్రయత్నిస్తుండగా, అమ్మ నా గదిలోకి వచ్చింది. సందీప్ పడుకున్న వైపు మంచం మీద కూర్చుంది.

కళ్ళెత్తి అమ్మ వంక చూశాను ఏమిటన్నట్టు.

"నీ అవస్థ చూస్తుంటే మనసు బాగోలేదమ్మా. నాన్న కూడా బాధ పడుతున్నారు. అరుణ్ అంతటి వారు అల్లుడవడం అదృష్టమని పొంగిపోయాము. అల్లుడిగారి హోదా, పరపతి చూసి మురిసిపోయాము. నువ్వో పెద్దింటి కోడలయ్యావని సంతోషించినంత సేపు పట్టలేదు. ఇప్పుడు నీ విషయం బాగా దిగులైపోయిందమ్మా." అంటూ కన్నీళ్ళ పర్యంతమైంది అమ్మ.

చీకాకుతో గజిబిజిగా ఉన్న నా మనస్సుకి, అమ్మనాన్న ఇంతలా దిగులుపడుతున్నారని తెలిసి రగులుతున్న మంటలో ఆజ్యం పోసినట్టయింది.

అంతలో నాన్న కూడా గది గుమ్మం దగ్గరికి వచ్చారు. "ఏమ్మా! ఇంకా పడుకోలేదా?" అంటూ లోనికొచ్చారు.

మంచం మీద నుండి లేచి, "రండి నాన్నా." అన్నాను.

వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చున్నారు. "చూడమ్మా! మీ మామయ్యగారి బంధువు ఒకాయన, దుర్గాప్రసాద్ గారు. అప్పట్లో నీ పెళ్ళికి హైదరాబాద్ వచ్చాడు. మొన్న ఢిల్లీలో బాబు పుట్టినరోజు పార్టీకి కూడా వచ్చాడాయన. పిల్లల ఆటలు చూస్తూ చాలాసేపు మాట్లాడుకున్నాము." చెప్పడం ఆపి మా వంక చూసారు నాన్న.

అమ్మా, నేను ఆసక్తిగా వింటున్నాము.

"అల్లుడు గారు చిన్నప్పటి నుండీ కూడా గొప్ప క్రీడాకారుడు కదా! క్రీడలలో ఎదుటివాడిని ఓడించి, తను గెలవడమే ధ్యేయంగా జీవిస్తారు క్రీడాకారులు. దుర్గాప్రసాద్ చెప్పంగా.. అరుణ్, అరుణ్ తండ్రి జగదీష్ గారు కూడా అలాగే ఉండేవారంట. అరుణ్ ఎందులోనూ ఓటమి ఎరుగడట. అతని చదువు కూడా స్పోర్ట్స్ స్కాలర్షిప్ తోనే అయిందట. దుర్గాప్రసాద్ చెప్పినదాన్ని బట్టి అల్లుడుగారి బాల్యం, పెంపకం, వ్యక్తిత్వం పై నాకు కొంత అవగాహన కలిగింది." అన్నారాయన.

"అయితే ఏమంటారు మీరు?" అడిగింది అమ్మ.

"చెప్పేదేమంటే, అరుణ్ బాల్యం అంతా ఆటలు, పోటీలు, గెలుపులుగా నడిచింది. ఆ అబ్బాయి మానసికంగా, శారీరికంగా ధృడంగా ఉండాలని ఎంతో క్రమశిక్షణలో ఉంచేవారంట వాళ్ళ నాన్నగారు. అదే పంథాలో ఇప్పుడు అరుణ్ కూడా కొడుకుని క్రీడాకారుడిగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నాడేమో." క్షణమాగి కళ్ళజోడు తీసి, తుడిచి మళ్ళీ పెట్టుకున్నారు నాన్న.

"అయితే, ఇంతకీ మీ అభిప్రాయం స్పష్టంగా చెప్పండి." అంది అమ్మ.

"అంటే కళ్యాణీ! నీ భర్త గురించి, మీ మామగారు గురించి కూడా అన్నీ మంచి సంగతులే చెప్పాడు దుర్గాప్రసాద్. కానైతే, అల్లుడుగారు పదే పదే ఇలా నిన్ను, పిల్లాడిని బాధ పెట్టడం, నీవు కుమిలిపోవడం కూడా దుర్భరమే. అన్నీ బాగా ఆలోచించు. ఇదేమన్నా సమిసిపోయే విషయం అయితే, నీవే తెలుసుకుంటావు. అలివి కానిదిగా ఉంటే మాత్రం మీ శ్రేయస్సు కోసం అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలి మరి." అంటూ నా వంక సూటిగా చూసారు.

"నీకు మా సహాయం, తోడు ఎప్పటికీ ఉంటుంది తల్లీ! నీ మీద మాకు పూర్తి నమ్మకముంది. కత్తి మీద సాము లాంటి ఈ పరిస్థితిని జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలి. తొందరపడనూ వద్దు. అలాగని జాప్యం చేయావద్దు. ఏమైనా, ఇప్పటికైనా మాస్టర్స్ చేసి లెక్చరర్ అయ్యే అర్హత సంపాదించమని నా సలహా. అవసరం వస్తే, స్వతంత్రంగా బతకవచ్చు." అన్నారాయన గంభీరంగా.

నాన్న చెబుతున్నది మౌనంగా ఆకళింపు చేసుకుంటున్నాను. ఆయన మాటలతో నాకు ఎంతో స్వాంతన, ధైర్యం కలిగాయి.

"ఇక పడుకోండమ్మా! ఆలస్యం అయింది." అంటూ పైకి లేచారు నాన్న. బాబుకి దుప్పటి కప్పి బెడ్-లైట్ వేసి వెళ్ళింది అమ్మ.

'అరుణ్ తో ఉన్న ఈ పరిస్థితిని చక్కదిద్దుకునేందుకు నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. చేయిదాటుతుందని అనిపిస్తే, నాన్నగారు అన్నట్టు మార్గాలుంటాయి. నా జీవితం పై నేనే ఎలాగైనా పట్టు సాధించాలి. ఇకనుండి పెద్దవాళ్ళని నా విషయంగా కలవరపెట్టకూడదు.' అనుకుంటూ నిద్ర లోకి జారుకున్నాను.

పొద్దున్నే ఆరుగంటల సమయంలో అత్తమ్మ ఫోన్ చేసారు. "అత్తమ్మా బాగున్నారా?" అడిగాను.

"పర్వాలేదు.. కళ్యాణీ! రెండురోజుల క్రితం బాత్రూములో కాలు జారి పడ్డాను. బాగా ఇబ్బంది పడుతున్నాను. ఎలాగూ నాకు మోకాలు సర్జరీ అవసరమే కనుక చేయించుకోమంటున్నారు డాక్టర్లు. పోతే, నీవు లేని వెలితి మాకే కాదు.. టోనీ, మోని లకి కూడా బాగా తెలుస్తుంది. నీవు వస్తే బాగుంటుంది." అనేసారు ఆమె.

"అత్తమ్మా! వీలయినంత త్వరలో బయలుదేరుతాను." అని చెప్పి ఫోన్ పెట్టేసాను. మేనేజర్ గుప్త గారికి ఫోన్ చేసి.. మరునాడే మా తిరుగు ప్రయాణానికి ఏర్పాటు చేయించాను. అలాగే, నాకోసం.. వెంటనే ల్యాప్–టాప్ తో పాటు ఓ డెస్క్–టాప్ కంప్యూటర్ కూడా తెప్పించమని ఆయనకి చెప్పాను.

ఇంతలో టిఫిన్ చేయమని అమ్మ పిలిస్తే వెళ్ళి, నాన్న గారి పక్కనే కూర్చుని పూరీ–కూర ఆరగిస్తున్న సందీప్ ఎదురుగా కూర్చున్నాను.

"కళ్యాణీ! మరో ముఖ్యమైన విషయం నీకు చెప్పాలమ్మా. వచ్చే యేడాది ఆఖరిలో చెన్నై వెళ్ళిపోదామని అనుకుంటున్నాము. అక్కడే ఉంటూ ఇంటిని డెవలప్మెంట్ కి ఇవ్వాలన్న నా ఆలోచనతో అమ్మ, వంశీ కూడా ఏకీభవించారు. ఆ చుట్టుపక్కల ప్రాంతంలో నానమ్మ ఇల్లు ఒక్కటే ఇంకా అలా పాతకాలం బంగళాలా ఉండిపోయింది." అంటూ నా వంక చూశారు.

"నాన్న గారు, నిజంగా మీరు ఏది చేసినా కుటుంబ అభివృద్ధికే ఆలోచిస్తారు. తప్పక అలాగే చేయండి." అన్నాను నా సంతోషాన్ని వెలిబుచ్చుతూ.

'కాదంబరి ఫ్లవర్స్' గురించి ప్రస్తావించే లోగానే.. "వచ్చే ఏడు నుండి పూర్తి బాధ్యతలని నేనే చేపడదామని ఆలోచన. అత్తయ్య వ్యాపారాన్ని నేనే చూసుకుంటున్న తృప్తి కూడా ఉంటుంది." అన్నది అమ్మ.

"నీవు 'కాదంబరి వ్యాపారం పై అజమాయిషీ చేబడితే నాకెంతో సంతోషం. మళ్ళీ 'కాదంబరి పేరు మ్రోగిపోతుంది. ఒక వెలుగు వెలుగుతుంది." అన్నాను కాఫీ తాగడం ముగిస్తూ.

అమ్మానాన్నల ముఖాల్లో సంతోషం చూడగలిగాను. వందన తల్లితండ్రులని పలకరించి వస్తానని చెప్పి వారింటికి బయలుదేరాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS